

# గోల గోపాలం

గోపాలరావుకు వయసొచ్చింది. ఉద్యోగం వచ్చింది. చదువొచ్చింది కాబట్టి – మరి ఏం రాలేదంటే పెళ్ళాం – పెళ్ళి చేసుకోకుండా పెళ్ళాం ఎలా వస్తుంది? అతనికింకా పెళ్ళి కాలేదు మరి.

పెళ్ళి ఎందుకు కాలేదంటే – అతను చేసుకోనని చెప్పలేదు. కాని పెద్దవాళ్ళు తెచ్చిన సంబంధాలు చేసుకోడట! అరేంజిడు మ్యారేజెసులో ప్రేమ ఉండదట! నేతి బీరకాయలో నెయ్యిలాగా.

ఈ ఆధునిక యుగంలో కూడా మూఢాచారాలను నమ్మడం, పాత చింతకాయ పచ్చడి సంప్రదాయాలను పాటించడం అతనికి నచ్చడం లేదు.

సాధారణంగా అందరూ పిల్లిని దుశ్శకునంగా భావిస్తారు. కాని అతగాడు మటుకు తను ఉద్యోగంలో చేరబోయే మొదటి రోజునే దాన్ని ఎదురు పిలిపించుకుని మరీ చేరాడు.

అలాగే అతను పెళ్ళిళ్ళకు పోయినా పిల్లిని చంకన పెట్టుకొని పోతూ ఉంటాడు.

'ఇదేం విడ్డూరమ'ని ఎవరైనా అడిగితే –" ఏం కుక్కల్ని వెంట బెట్టుకు రావడం లేదా? ఇదీ అంతే ! రెండూ జీవాలే!" అని వారి నోరు మూయించేవాడు.

అలాగే పుట్టిన రోజు పండుగల సందర్భంగా ఎవరైనా కేక్ మీద క్యాండిల్సు వెలిగించి వాటిని ఆర్పేస్తే ఊరుకోడు.

" ఇదేం ఆచారమండీ బాబు! అసలు క్యాండిలు ఎందుకు వెలిగించాలి! వెలిగించితివిపో – దాన్ని బాగా వెలగనివ్వకుండా 'ఉఫ్' మని ఊదడమేంటి? దీనికర్థమేంటి?" అని వాపోతాడు. "వాళ్ళ ప్రాణాలు కూడా ఇలా ఆరిపోవాలనా?" అని అడుగుతాడు.

అందుకే ఈ మధ్య ఎవరూ అతన్ని బర్తుడే ఫంక్షన్లకు ఆహ్వానించడం లేదు. డబ్బులు మిగిలిపోయాయని అతను సంతోషపడుతున్నాడు.

వాళ్ళ నాన్న ఎన్నో సంబంధాలు తెచ్చాడు కానీ – గోపాలరావు – "ఛాఛ్! గాడిదలా ఎదిగిన నేను – ఇంకో గాడిదని చేసుకోవడమేంటి? అదీ మీలాంటి పాత చింతకాయ తరం వాళ్ళు తెస్తే చేసుకోవడమేంటి?" అని తిరస్కరించేవాడు.

" మరి నీకు పెళ్ళి ఎలా అవుతుందిరా అంట్ల వెధవా?" అని తండ్రి కోప్పడ్డాడు. చెట్టంత మొగాడ్ని గుండెలమీద పెట్టుకుని వీధిలోకి అడుగు పెట్టాలంటే సిగ్గుగా ఉంది. కనిపించిన ప్రతి వెధవా కామెంటు చేసేవాడే - మీ అబ్బాయికి పెళ్ళి కాదా అని ఒకడు - అస్సలు చేసుకుంటాడా అని యింకోడు - మీ అబ్బాయికి నచ్చినమ్మాయి ఈ భూమ్మీద యింకా పుట్టలేదా అని ఇంకో గాడిద - పెళ్ళి చేస్తే మా ఆస్తి అంతా కోడలు కొట్టేస్తుందని మేము భయపడుతున్నామని కొందరు, పెళ్ళి కాగానే మమ్మల్ని అనాథశరణాలయాలకు తరిమేస్తారని - మేము భయపడి పెళ్ళి చేయడం లేదని కొన్ని గాడిదలు - రకరకాలుగా కూస్తున్నారురా ! ఆ బాధ నీకేం తెలుస్తుందిరా?" లబలబ లాడేవాడు జనకుడు.

" వాళ్ళనెవర్నో నా ముందుకు రమ్మను - నరికేస్తా మాటలతో - అయినా పెళ్ళి నా పర్సనల్ మేటరు- ఊళ్ళో వాళ్ళ కోసం చేసుకోవాలా?" గట్టిగా ప్రశ్నించాడు గోపాలరావు.

" ముష్టి వెధవా! ఎక్కడ నలుగురు చేరినా ఇదే టాపిక్ ! గోపాలం గొట్టంగాడికి పెళ్ళి అవుతుందా, కాదా అని కొందరు బెట్టులు కూడా కట్టుకుంటున్నారు- నా మాట విని ఏ కుంటి దాన్నో - గుడ్డిదాన్నో నోరెత్తకుండా పెళ్ళి చేసుకుని చావు!" ఆశీర్వదించాడు పాపాలరావు.

" అంత కర్మ నాకేం వచ్చింది నాన్న!"

" బెండకాయ ముదిరినా బ్రహ్మచారి ముదిరినా పనికిరాదని సామెత వినలేదా జడ్డి వెధవా! నీ వయస్సులో నా కిద్దరు పిల్లలు బళ్ళో చదువుకుంటున్నారు. నువ్వూ - వున్నావు- ఓ ముద్దూ లేదు - ముచ్చటా లేదు. నువ్వు "ఊ" అన్నావంటే కొండ మీద కోతినైనా తెచ్చి నీ మెళ్ళో తాళి కట్టించేస్తాను." ఆవేశ పడ్డాడు పాపాలరావు.

" మీ మతి మండ - తాళి కట్టాల్సింది వాడండి - వాడు మెళ్ళో తాళి కట్టించుకుంటే మన బతుకులు ఎగతాళి అయిపోవూ...!" పాపాయమ్మ గుర్తు చేసింది.

" వీడి పెళ్ళి కాదు కాని - నా మతి పోతున్నది- అది అయ్యేటప్పటికి నేనే పోతానేమో!" పాపాలరావు గంతులేశాడు.

" పెళ్ళి అన్నది నూరేళ్ళ పెంట నాన్నా ! అంత తొందర పడితే ఎలా?"

" నీ మొహం మండ ! పెంట కాదురా పంట ! ఇప్పటికే నీకు ముప్పయి దాటాయి - ఇంక ఎంతకాలం బ్రతికి చావగలవు- మహా అయితే నలభై - ఆ నలభైలో ఎంత కాలం కాలు చెయ్యి ఆడించగలవు- మహా అయితే పాతిక సంవత్సరాలు - ఈ పాతిక సంవత్సరాలు ఆరోగ్యంగా ఉండగలవా! ఏ మంచానో పడకుండా వుంటావా? ఉద్యోగం కోసమే పదిహేను సంవత్సరాలుపైన పోతుంది. ఇంక నువ్వు అనుభవించేదేంటిరా అడుక్కుతినే వెధవా?" పాపాలరావు పరి పరి విధాల తిడుతున్నాడు గోపాలరావును.

" అయితే ఇపుడేం చెయ్యమంటావు?" చికాగ్గా అడిగాడు.

" వెంటనే పెళ్ళి చేసుకు చావరా తండ్రీ !"

" చావడానికి పెళ్ళెందుకు? ఏం పెళ్ళి చేసుకోక పోతే ఆ యముడు ఒప్పుకోడా ప్రాణం తీయడానికి?" లా పాయింట్ లేవదీశాడు.

" వెధవ కుంకా ! ఈ తెలివి తేటలకేం మస్తుగా ఉన్నాయి - జీవితానికి కావల్సినవి మటుకు లేవు- ఈ ఊళ్ళోనే గజ్జల గుర్రంలాంటి ఓ అమ్మాయి రెడీగా ఉంది. నిన్ను చేసుకుని చావడానికి. నువ్వు "ఊ" అంటే ఆ అమ్మాయిని చూసి చద్దాం!" కొన్ని వివరాలు చెప్పాడు తండ్రి.

" ఈ పాత సంప్రదాయాలు నాకిష్టం ఉండవు - అయినా నువ్వడిగావు కాబట్టి ఈ ఒక్కసారికి నీ మాట వింటాను చిన్న సవరణతో. అమ్మాయిని మనం చూడం - మనల్ని ఆ అమ్మాయి చూస్తుంది" కొంచెం సర్దుబాటు ధోరణిలో చెప్పాడు.

" నెల తక్కువ వెధవా ! అలా చేస్తే నలుగురూ నవ్వరురా!" తండ్రి కస్సుబుస్సులాడాడు.

" అయ్యో రామ ! మొగ పెళ్ళి వాళ్ళంగా మనకి అవమానం కాదుటరా!" తల్లి విస్మయంగా అడిగింది.

" ఆడ, మొగ అన్న భేదాలు పోవాలి ! స్త్రీ పురుషులకు సమాన హక్కులుండాలి! ఎవరు - ఎవర్ని చూస్తున్నారు అని కాదు ప్రశ్న. ఇద్దరికీ ఆమోదం అయిందా లేదాన్నది ముఖ్యం ! అదీగాక పెళ్ళంటూ జరిగితే ఆమె కదా మనింటికి వచ్చేది - కాబట్టి ముందు మనిల్లు మన వాతావరణం ఆమెకు నచ్చాలి!" చెప్పాడు గోపాలరావు గోలగా.

" సరే అలాగే కానిద్దాం" ఓ నిర్ణయానికొచ్చాడు పాపాలరావు.

ఆ సాయంత్రం రంజని గోపాలరావును చూడ్డానికి వచ్చింది. ఆమె తండ్రి కూర్మారావు, తల్లి వరదమ్మతో కలిసి. ఆమె దర్జాగా సోఫాలో కూర్చుంది.

అప్పుడు అయ్యగారు నాజుగ్గా ప్రవేశించాడు, వెనక పాపాలరావు పాపాయమ్మలు అనుసరించగా.

తను ఈమె ఎదురుగా కూర్చొన్నాడు.

ఈలోగా పని పిల్ల గంగ కాఫీలు టిఫిన్లు తెచ్చిచ్చింది.

ఆమె ఎదుట మింగడానికి మొహమాట పడి పక్కన పెట్టేశాడు గోపాలరావు - కాని రంజని మటుకు ఓ పట్టు పట్టింది టిఫిన్ను- కాఫీని. 'బ్రేవు' మని త్రేన్చింది.

కాసేపు దగ్గాడు గోపాలరావు ఏమైనా అడగమన్నట్లు.

" అమ్మాయి - నీకేమైనా సందేహాలుంటే అడుగు" కూర్మారావు వంకరగా అడిగాడు.

" చూడండి - గోపాలరావు - మిమ్మల్ని నేనేం అడగాలి?" అమ్మాయి కూసింత సిగ్గు

పడుతూ అడిగింది.

" అది నీ యిష్టం!" కుండ బద్దలు కొట్టినట్లు అన్నాడు.

" స్త్రీ స్వాతంత్ర్యం పైన మీ ఉద్దేశం ఏమిటి?" ఆమె అడిగింది.

" ఎచ్చట స్త్రీలు పూజించబడతారో అచ్చట మొగవాళ్ళు సుఖపడతారు. ఎచ్చట పురుషులు పూజించబడతారో అక్కడ స్త్రీలు కష్టపడతారు" చెప్పాడు.

" మీకు ఏవి వచ్చు ?"

" నాకు డాన్సు, పాడటం, సంగీతం, ఆడటం, వంట చేయడం వగైరాలు రావు" అని సిగ్గుపడుతూ చెప్పాడు.

" మరి ఏం వచ్చు?"

" పిల్లల్ని కనడం - పెంచడం - ఆడించడం- గుమాస్తాగిరి చేయడం వచ్చు" అని చెప్పాడు మెలికలు తిరిగిపోతూ.

రంజని కొంచెం ఖంగు తిన్నట్లుంది.

" మీకు ఇంతకు ముందు పెళ్ళయిందా!?"

" లేదు... దేవుడు మేలు చేస్తే ఇది మొదటిది అవుతుంది" సిగ్గుపడుతూ చెప్పాడు.

" మీ దగ్గర హెచ్.ఐ.వి. సర్టిఫికెట్ ఉందా?" అడిగింది కాసేపు ఆలోచించి రంజని.

" లేదు ఎప్పుడూ తీసుకోలేదు."

" రేపు తీసుకు వస్తారా?"

" తీసుకు వస్తాను కాని ఆ ఖర్చు మీరు భరించాలి!" చెప్పాడు.

ఆ పైన పాపాలరావుకు కోపం వచ్చింది.

" తింగరి వెధవ ! నీకెందుకురా ఆ సర్టిఫికెట్టు- ఉద్యోగంలో చేరేప్పుడు డాక్టరు సర్టిఫికెట్టులాగా పెళ్ళికి ముందు నీకు సర్టిఫికెట్టు కావాలిరా - అప్రాచ్యుడా?" కేకలేశాడు.

" అబ్బాయి తెస్తానంటున్నాడుగా మీకెందుకూరుకోండి !" పాపాయమ్మ సర్దిచెప్పింది.


" సరే! నాకూ ఓ చిన్న సర్టిఫికెట్టు కావాలి తీసుకు వస్తారా రంజని గారూ!" మర్యాదగా అడిగాడు గోపాలరావు.


" ఏంటది?" చిరునవ్వుతో అడిగింది. " నా డిగ్రీ సర్టిఫికెట్టా, టెంతుక్లాసు సర్టిఫికెట్టా-? నా వయస్సు కరెక్టుగానే చెప్పాను."

" కాదు... వర్జినిటీ సర్టిఫికెట్టు - హెచ్.ఐ.వి. సర్టిఫికెట్టు!" నిదానంగా చెప్పాడు.

రంజని తోక తొక్కిన తాచులా బుస్సుమని లేచింది.

" వాట్ నాన్సెన్స్ ఆర్‌యూ టాకింగ్? నేను నిప్పును - నన్ను ముట్టుకుంటే మసి అయిపోతావు!"


మంత్రిగారు నిర్దోషి! వారింట్లో దొరికిన సొమ్ముకి అవినీతికి సంబంధించి గాదు! అవన్నీ దొంగనోట్లు! అదిమా.. సెక్షన్ గాదు!
CBI


ఏమైనా పాత కబుర్లు చెప్పండి!
ఆఁ.. అప్పుడు! గాంధీగారు నెహ్రూగారితో కలిసి నేను ఆమరణ దీక్ష చేశాం!!
AVM

" ఆ సంగతి మీకు తెల్సు - కట్టుకుంటే నాకు తెలుస్తుంది. కాని లోకానికి తెలియాలి గదా మరి - అందుకని ముందు జాగ్రత్తగా...!"

ఈలోగా రంజని వలవల ఏడ్చింది...

కూర్మారావు బలహీనత ఏంటంటే కూతురు ఏడిస్తే చూడలేడు - " గోపాలరావు నీ మొహానికి పెళ్ళి కావల్సి వచ్చిందా - ముదిరిపోయిన బెండకాయవు - చీకేసిన తాటి టెంకలాంటి మొహం నీది - నా కూతుర్ని పట్టుకుని అంత మాట అంటావా? నీ పైన కోర్టులో కేసు వేస్తాను."

" పెళ్ళి కాకుండానే కోర్టు అంటున్నావు - అయింతర్వాత ఇంక ఏం చేస్తావో - ఈ సంబంధం మాకొద్దు-" అంటూ పాపాయమ్మ గయ్‌మని లేచింది.

కాసేపు ఇల్లు రణరంగంగా మారిపోయింది.

పాపాలరావు - కూర్మారావు కాలరు కాలరు పట్టుకునే పరిస్థితి - పాపాయమ్మ - వరదమ్మ కొప్పు కొప్పు పట్టుకునే ఆవేశం... ఈలోగా రంజని తన చెప్పు తీసి గోపాలరావు దవడ వాయించింది. సదరు గోపాలరావు ఆమె డొక్కలో ఓ పోటు పొడిచాడు.

ఈలోగా బయట వున్న మధ్యవర్తులొచ్చి విడిపించారు. ఆ సంఘటన తర్వాత పాపాలరావు గోపాలరావును పెళ్ళి చూపులకు రమ్మని అడగటానికి సాహసించలేకపోయాడు.

" పింజారి వెధవా ! నీ పాట్లు నువ్వు పడు ! నీకీ జన్మలో పెళ్ళి కాదు- నా చేత్తో ఏ సంబంధం తీసుకురాలేను.... నువ్వు ప్రేమించి చచ్చి చేసుకుంటావో - ఇలాగే బ్రహ్మచారిలాగా చచ్చిపోతావో, నీ మొహం మండ.... నిశ్చయించుకో!" అని గీతోపదేశం చేశాడు పాపలరావు.

అప్పటి నుంచి గోపాలరావు ప్రేమ కోసం ప్రయత్నిస్తున్నాడు, కొన్ని అనుభవాలు కలిగాయి-

బాగా ఎర్రగా బుర్రగా రోడ్డుమీద కన్పించిన అమ్మాయిని బీటుకొట్టి - ఏకాంతంగా కల్సి అడిగాడు ఒకసారి...

" నిన్ను నేను ప్రేమిస్తున్నాను... మన పెళ్ళికి నీకేమన్నా అభ్యంతరమా?"

" నాకేం అభ్యంతరం లేదు కాని ఎటొచ్చి మా ఆయన ఏమంటాడో కనుక్కోవాలి!" అని చెప్పింది కోమలి.

దాంతో పారిపోయి వచ్చాడు -

ఇంకోసారి ఇంకో అమ్మాయిని ప్రేమించే ముందు, ముందుజాగ్రత్తగా ఓ ప్రశ్న అడిగాడు " మేడం మీకుగాని - మీ ఆయనకు గాని - నేను మిమ్మల్ని ప్రేమిస్తే, పెళ్ళి చేసుకుంటే అభ్యంతరం లేదు కదా" అని.

" ఇడియట్ ! పెళ్ళి కాకుండానే నాకు మా ఆయన ఎలా వస్తాడురా!" అని చెంప ఛెళ్ళుమనిపించింది ఆ మేడం.

మరొకసారి... "మిమ్మల్ని ప్రేమించడానికి నావైపు నుండి అభ్యంతరం ఏమీ లేదు–" అని మొదలెట్టే సరికి – ఆమెకు 'వైపు ' కాస్తా 'వైఫ్' క్రింద అర్థమైంది – ఈడ్చి కొట్టింది "నీ బ్రతుక్కు ఒక వైఫ్ చాల్లేదురా – ఇంకో వైఫు కావాల్సి వచ్చిందా?" అంటూ...

ఒకానొక సారి.. ఒకావిడను అడిగాడు... " మీరు గాని నన్ను గాని ప్రేమించడం లేదు గదాని?"

"ఎందుకు అనుమానం వచ్చింది?" వాకబు చేసింది ఆమె.

" మిమ్మల్ని పెళ్ళి చేసుకోవడానికి నాకు ఎటువంటి అభ్యంతరం లేదు.. అందుకని.." అని చెప్పాడు... " మరి మీకు కూడా –?" అన్నాడు.

" అబ్బెబ్బే ! అదేం లేదు.. నా పాపని అడగాలి.. అది కొంచెం ఒప్పుకుంటే చాలు.." చెప్పింది సుకన్య.

" మీకు పాప వుందా– పెళ్ళియిందా?" అడిగాడు.

" పెళ్ళి కాకుండా పాప ఎలా పుడుతుందిరా పుండాకోర్?" అని కోప్పడింది సుకన్య.

" మరి మీ ఆయనకు – మీరిలా చేస్తే –" అని అడగబోయే సరికి...

" ఆయన ఉంటే నిన్నెందుకు చేసుకుంటానురా రాస్కెల్ – ఆయన చచ్చి ఆర్నెల్లు కూడ కాలేదు–" అంటూ ఓ చెంప వాయించింది.

దాంతో గోపాలరావుకు కొన్ని ప్రాథమిక సూత్రాలు అవగతమయ్యాయి – ప్రేమించే ముందు మెళ్ళో మంగళ సూత్రం ఉందా లేదా అని పరిశీలించాలి... కాళ్ళకు మట్టెలున్నాయా లేదాని గమనించాలి – ఒక వేళ ఆమె దగ్గర పిల్లలుంటే ఆ పిల్లలు ఆమెకి పుట్టిన వాళ్ళా కాదా నిర్ధారించుకోవాలని... లేదా పక్కింటి పిల్లలాని తెలుసుకోవాలని.

ఇంకో సందర్భంలో – సుహాసిని ఒక పాపతో పార్కులో కనిపిస్తూంటే అడిగాడు.

" సుహాసిని గారు ! మీకు పెళ్ళయిందా ? మీకు మీ ఆయన ఉన్నాడా? ఈ పాప మీకూ మీ ఆయనకే పుట్టిందా?"

" ఏం గోపాలం ? ఒళ్ళు ఎలా ఉంది? నీ కంటికి నేను ఎలా కనిపిస్తున్నాను?" కోపంగా అడిగింది సుహాసిని.

" ఒక వేళ ఈ పాప మీ పాపో, కాదో అడుగుదామని !"

" అంటే నేను పిల్లల్ని దొంగిలించే దానిలా కనిపిస్తున్నానా?"

" అని కాదు ... పెళ్ళి చేసుకునే ముందు జాగ్రత్తగా ఎంక్వయిరీ చేయాలని అడుగు తున్నాను..." నాన్చాడు గోపాలరావు.

" రోగ్ ! నీ పెళ్ళికి నా పాపకు సంబంధం ఏంటి?"

" నేను ప్రేమిస్తున్నది మిమ్మల్ని కాబట్టి !" అమాయకంగా చెప్పాడు.

" అరే గోపాలం ! నాకు మొగుడు పిల్లా ఉన్నారయ్యా !నన్నెలా ప్రేమిస్తున్నావు!?" ఆశ్చర్యంగా – కోపంగా అడిగింది సుహాసిని.

" మీ కభ్యంతరం లేకపోతే – మీ మొగుడ్ని మీరు వదిలేసి నన్ను చేసుకోండి – పాపను కావాలంటే మీతో ఉంచుకోండి – లేకపోతే అనాధ శరణాలయంలో చేర్పించినా ఫర్వాలేదు– నేను మటుకు మిమ్మల్ని ఘాటుగా ప్రేమిస్తున్నాను" ధైర్యంగా చెప్పాడు.

అంతే ! ఆమె నాలుగు తన్నులు తన్ని కూడా వదిలి పెట్టలేదు – ర్యాగింగ్ కింద అతన్ని పోలీసు స్టేషనుకు తీసుకుపోయి అప్పజెప్పింది.

యస్సై ' నీకివేం బుద్ధులు' అని దేహశుద్ధి చేశాడు.

అంతే గాకుండా కేసు బుక్ చేసి – సెల్‌లో తోశాడు.

ఈ సంగతి పాపాలరావుకు తెల్సి లబోదిబో అంటూ స్టేషనుకు పరుగెత్తుకుంటూ వచ్చాడు – అయినా యస్సై వినలేదు...

ఇంక పాపాలరావు అతని కొలీగ్సు దగ్గరికి పోయి జరిగింది చెప్పాడు. వాళ్ళ యూనియన్ నాయకులు వచ్చి ఎమ్మేల్యేతో చెప్పించి నానా కష్టపడి – చేతి చిలుం వదిలించుకుని కేసు మాఫీ చేశారు. లేకపోతే వాళ్ళ రూల్సు ప్రకారం ఒక రోజు సెల్‌లో వుంటే ఉద్యోగం ఊడేది.

పెళ్ళయిన వాళ్ళను ప్రేమించకూడదని గోపాలం స్వానుభవంతో తెలుసుకున్నాడు.

ఇంకోసారి ఓ అమ్మాయి యితన్ని పెళ్ళిచేసుకుంటానని ఒప్పుకుంది కాని... అతని స్నేహితులు చెప్పారు ఆమెని గురించి – ఆమెకు లాడ్జీలలో మాంచి అనుభవం ఉందని...

" శోభను నువ్వు పెళ్ళి చేసుకుంటే ఆమె నీకే పెళ్ళాం కాదురా – మనందరికి అవుతుంది..." ఓ అనుభవజ్ఞుడు చెప్పాడు.

క్రమంగా గోపాలం ఖ్యాతి ఊరుదాటి, జిల్లాదాటి, రాష్ట్రం దాటి, దేశం దాటి పోయింది. డైవర్సు తీసుకున్న విదేశీ సంబంధాలు, యితర మతస్తుల సంబంధాలు రాసాగాయి.

అటువంటివి చేసుకున్నావంటే మూకుమ్మడిగా ఆత్మహత్య చేసుకుంటామని తల్లి, తండ్రి గట్టిగా హెచ్చరించారు. దాంతో తనకు ఎంత విశాల హృదయమున్నా తన పరిధిని ఆంధ్రాకు పరిమితం చేశాడు గోపాలం.

ఓ రోజు శైలజ వెంట పడ్డాడు – ఎన్నాళ్ళకో ఆమె ఒంటరిగా కనిపిస్తే.

" శైలూ ! శైలూ ! నిన్ను పెళ్ళి చేసుకుంటాను."

శైలజ పెద్ద ఉద్యోగస్తురాలు.

" రేయ్ ! నిన్ను పెళ్ళి చేసుకోవడానికి నీకున్న అర్హత ఏంటిరా ? " నిలదీసి అడిగింది సరదాగా.

" నాకు పెళ్ళికాలేదు - నీకూ కాలేదు- చాలదా?" తెలివిగా అడిగాడు.

" సరే - ఆ గాడిదకు కాలేదు - నీకూ కాలేదు - దాన్ని చేసుకుంటావా?" రోడ్డుకు అడ్డంగా నిలబడి అలౌకిక ఆనందం అనుభవిస్తున్న ఓ తెల్ల గాడిదను చూపిస్తూ అడిగింది.

ఖంగు తిన్నాడు గోపాలరావు....

" అది కాదు - నిన్ను నేను గాఢంగా ప్రేమిస్తున్నాను - నాది గుంటూరు మిరపకాయలాగా ఘాటు ప్రేమ!" వంకర్లు తిరిగాడు గోపాలం.

" మీ యింట్లో అద్దం ఉందా?" అడిగింది శైలజ.

" లేదు పగిలి పోయింది." చెప్పాడు తలవంచుకుని.

" అదీ సంగతి ! అద్దం కొనుక్కుని నీ మొహం చూసుకో - ఎలా ఉందో తెలుస్తుంది... నక్కకు నాగలోకానికి పెళ్ళి కుదురుతుందా? మనిద్దరికీ కుదర్దు!" చెప్పింది వెళ్ళబోతూ - అతని అమాయకత్వానికి చింతిస్తూ.

" ఏమ్మా ! నాకేం తక్కువ - ఒడ్డూ పొడవున్నా- మొగాడ్ని... ఉద్యోగం చేస్తున్నా.. కాస్తో కూస్తో చదువు సంధ్యలున్నాయి" కాళ్ళకు అడ్డం పడ్డాడు. ఆమెను వెళ్ళనివ్వకుండా.

" చూడు గోపాలం ! నాకున్న స్తోమత నీకు తెలీదు - నా ఉద్యోగం , సంపాదన నీకు తెలీదు - నీలాంటి వాళ్ళను వందమందిని కొనగలను- మా వంశ మర్యాద నీకు తెల్సా? పెద్ద పెద్ద అయ్యేయస్ ఆఫీసర్లు నాకోసం రెడీగా ఉన్నారు- నేను 'ఊ' అంటే చాలు - అటువంటిది ఓ గొట్టం గాడివి - అడ్డగాడిదలా నా వెంట పడతావా? ఇంకోసారి ఇలా చేశావంటే నిన్ను డిస్మిస్ చేయిస్తాను మీ ఆఫీసరుతో చెప్పి !" డ్రైవరు తెచ్చిన కారెక్కి వెళ్ళి పోయింది శైలజ- అతనికి గట్టి వార్నింగు యిచ్చి.

గోపాలంకు శైలజ మాటలు షాకిచ్చాయి - తనకేం తక్కువయిందో అతనికి అర్థం కావడం లేదు మరి.


ప్లీజ్ మీరన్నా గోపాలంకు సంబంధం చూసి పెట్టరూ !

గోల గోపాలంను ఆ బాలగోపాలంతో చూసే అవకాశం కల్పించరూ !


- నది జూలై 2007



మీకు తమిళం రాదుగా!
మద్రాసు వెళ్తానంటున్నారు!?
నోట్లో కిళ్ళీ.. నములుతూ...! మాట్లాడితే!... చాలన్నారు ఫ్రెండు!...
-AVM


మాంచి ఐడియాసార్! పెళ్ళాంతో గాని ప్రియురాలితో గాని సెక్స్ చేస్తే టాక్స్ కట్టాలని 'జీవో' పెడ్దాం! కోట్లు కోట్లు రెవెన్యూ వస్తుంది!!
అర్థిక శాఖ
-AVM


ఇతను, నాకు లక్షరూపాయలు బాకీ క్రితం జన్మలో!!
న్యాయమైన వడ్డీతో ఇప్పించండి చాలు!!
AVM


కొంచెం పెద్దగా పోట్లాడుకోండీ! మాకేం వినబడి చావటం లేదూ! అంటున్నారు! పక్కవాటా వాళ్ళు!!
AVM


సరళా! పదకొండైంది.. నాకు నిద్ర వస్తోంది!
అమ్మనైను రమ్మనైను శోభనానికి !!
AVM
అంటే! నిద్రపోదాం
రమ్మని అర్థం లేవే!


INOX
"ప్రేమకథ"
సినిమాను
రెండురోజులూ
ఆదరించిన
సందర్భంగా
2 రోజుల
వేడుకసాయంత్రం
జూబ్లీహిల్స్‌లో
AVM